జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- పెద్దిపాలెంలో రైతు భరోసా కేంద్రం ప్రారంభం


వెల్లంకిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : పేదల కోసం నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలో నిర్మాణంలో ఉన్న 36 జగనన్న లే అవుట్లలో తాగునీరు అందించడానికి రూ.4.49 కోట్లతో నిర్మించనున్న మంచినీటి పథకాలకు ఆయన సోమవారం వెల్లంకి కాలనీ వద్ద శంకుస్థాపన చేశారు. పెద్దిపాలెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో అరకొరగా కాలనీ ఇళ్లు నిర్మించే వారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి 31 లక్షల మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం ఒక చరిత్ర అన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు గ్రామం శివారున కాలనీ ఇళ్లు నిర్మించి వివక్ష చూపేవారని... ప్రస్తుతం అందరినీ సమభావనతో చూస్తూ గ్రామాల నడిబొడ్డున అన్ని కులాల వారికి ఒకే దగ్గర ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. అప్పట్లో అరకొరగా ఇళ్లు నిర్మించడం తప్ప కనీస సౌకర్యాలు కల్పించే వారు కాదని... ప్రస్తుతం తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పునాదుల స్థాయిలో ఉండిపోయిన వాటికి ప్రభుత్వం ముందస్తుగా రూ.20 వేలను లబ్ధిదారులకు అందిస్తోందన్నారు. సిఫార్సులకు తావు లేకుండా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. వెల్లంకి గ్రామంలో 403 మందికి ఇళ్ల స్థలాలు అందించామని, ఇక్కడ సుమారు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు ఉప్పాడ లక్ష్మణరావు, బావిశెట్టి భారతమ్మ, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పార్టీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, స్థానిక నాయకులు ఎం.చిన్నయ్య పాత్రుడు, పిన్నింటి వెంకట రమణ, కాకర వెంకట రమణ, కంచరాపు శ్రీనివాసరావు, చెన్నా సత్యం, పడాల రాము, బోర అప్పారావురెడ్డి, కంఠిమహంతి చంద్రమౌళి, బీఆర్‌బీ నాయుడు, బొట్టా రామకృష్ణ, బావిశెట్టి రాజు, కూరాకుల వెంకటేష్, గుండు నానాజీ, రౌతు వెంకటరావు, కూరాకుల మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం

భీమునిపట్నం: చక్కగా చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో మరింత ప్రోత్సాహం అందిస్తోందని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పరీక్షల్లో 600కు 565 మార్కులు సాధించిన ఎ.విజయకు రూ.3 వేలు, 531 మార్కులు సాధించిన వై.అనితకు రూ.2 వేలు, 529 సాధించిన ఎం.త్రిలోచనకు వెయ్యి రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని పాఠశాలలో సోమవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను 'నాడు – నేడు' పేరుతో కార్పొరేట్ స్కూళ్లకన్నా చక్కగా తీర్చిదిద్దడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు. ఉపాధ్యాయులు సుజాత కుమారి, అల్లాడి శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

పద్మనాభం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన మండలంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడళ్లు సోమవారం అందజేశారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామినేని అంజలి, బుగత హేమ లత, సుంకర లోకేష్‌కు వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.బాలామణి, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ నరిసింహనాయుడు పాల్గొన్నారు.

- బి.ఆర్.తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు అందజేశారు. హెచ్‌ఎం బి.అప్పలరాజు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఆనందపురం : ప్రజలకు కష్టాల నుంచి విముక్తి కలిగించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని గంభీరం పంచాయతీ కల్లివానిపాలెంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది నాయకులు ఎన్నికలు వచ్చినప్పుడు వాగ్దానాలు చేయడం.. గెలిచిన తర్వాత వాటిని గాలికొదిలేసి సొంత లాభం చూసుకోవడంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఆ తరుణంలో ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న పలు నిర్ణయాలు బడుగు బలహీన వర్గాల జీవితాలనే మార్చివేశాయన్నారు. ప్రతి గ్రామంలోనూ ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయ భవనాలు, నాడు – నేడు కింద పాఠశాలల అభివృద్ధి, రీ సర్వేతో భూముల సంరక్షణ చట్టం, సచివాలయాల్లోనే స్థానికంగా భూ రిజిస్ట్రేషన్లు వంటి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి రాష్ట్రం రూపు రేఖలనే మార్చివేశారన్నారు. ఈ సందర్భంగా నాలుగేళ్లలో ప్రభుత్వ పరంగా పొందిన లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలను గడప గడపకు వెళ్లి అందజేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పునర్నిర్మాణం చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లవరాజు, వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, బొట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో - 2గా బాబూలాల్ బాధ్యతల స్వీకరణ


ఎంఈవో బాబూలాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పద్మనాభం: పద్మనాభం ఎంఈవో – 2గా బాబూలాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పద్మనాభం ఎంఈవో – 2గా వచ్చారు. ఇతనికి ఎంఈవో – 1 శివరాణి, డీసీఈబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణకుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్.జగదీష్‌బాబు, ఎ.అరుణ్ కుమార్, బి.సూర్యనారాయణ, పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఎండాడలో అనధికార నిర్మాణం తొలగింపు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో అనధికారిక నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఓ వ్యక్తి ఇక్కడ అనధికారికంగా కమర్షియల్ షెడ్ నిర్మించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించమని నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఏసీపీ కోనా వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో ఈ అనధికారిక నిర్మాణాలను తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదనపు పోలింగ్ కేంద్రాలు అవసరం

భీమునిపట్నము: భీమిలి నియోజకవర్గ పరిధిలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అదనంగా పలు చోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన పలు రాజకీయ పార్టీల నాయకులతో ఓట్ల నమోదు, ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. భీమిలిలో ప్రస్తుతం 3.34 లక్షల ఓటర్లు ఉన్నారని, వీరికి 335 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. భీమిలి, తగరపువలస, మధురవాడ, ఎండాడ తదితర ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువగా పెరుగుతోందని, అందువల్ల ఈ ప్రాంతాల్లో అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దామోదరరావు, కానూరు రాంబాబు, కంటుభుక్త రామానాయుడు పాల్గొన్నారు.

'సత్యకల్యాణి లే అవుట్ వైపు కాలువ నిర్మించొద్దు'


సంగివలస కొండప్ప చెరువు గట్టుపై నిరశన తెలుపుతున్న సంగివలస వాసులు

తగరపువలస: సంగివలస కొండప్ప చెరువును ఆనుకుని సత్యకల్యాణి లే అవుట్ వైపు రూ.3 కోట్లతో జీవీఎంసీ నిర్మించ తలపెట్టిన కాలువ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం చెరువు దిగువ రైతులు, సంగివలస గ్రామస్తులు నిరశన తెలిపారు. ఈ మేరకు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, భీమిలి జెడ్సీ, ఇరిగేషన్ విభాగాల అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కొండప్ప చెరువు గట్టుపై వారు మాట్లాడారు. 14.50 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువుకు ఈశాన్య భాగంలో అవుట్‌లెట్ ద్వారా చిల్లపేట చెరువుకు, సంగివలస కాలనీవైపు ఉన్న అవుట్‌లెట్ ద్వారా బాలాజీనగర్ గెడ్డలలోకి వర్షం నీరు పోయేదన్నారు. ప్రస్తుతం చెరువు చుట్టూ అపార్ట్‌మెంట్లు నిర్మించడంతో మురుగునీరు చెరువులోకి కాకుండా నివాస ప్రాంతాలు, సర్వీస్ రోడ్డుపై నిలిచిపోతుందన్నారు. చెరువు ఈశాన్యంలో అవుట్‌లెట్‌ను దివీస్ యాజమాన్యం పార్కు అభివృద్ధి పేరుతో మూసివేయగా... కాలనీవైపు అవుట్‌లెట్ ఎత్తు పెంచడం ద్వారా వర్షం నీరు, మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ రెండు అవుట్‌లెట్లు ఆధునికీకరించి ఎత్తు తగ్గిస్తే పూర్వం వలే చెరువు నుంచి అవుట్ ఫ్లో జరిగి సర్వీస్‌రోడ్డుపై నీరు నిలవదన్నారు. దీనిని కాదని ఉత్తర దిశలో చెరువు గట్టును ఆనుకుని కాలువ తవ్వించడం ప్రమాదకరమన్నారు. దీనివల్ల చెరువు గట్లు బలహీనపడి గండ్లు పడటం, గట్టుపై వాకింగ్ ట్రాక్ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. రూ.3 కోట్లతో నిర్మించే కాలువ ద్వారా చెరువు నీటిని సత్యకల్యాణి లే అవుట్ వైపు మళ్లిస్తే పరిసర గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు. అందువల్ల కాలువ నిర్మాణాన్ని అడ్డుకుంటామన్నారు. చోడిపల్లి సాయి జయశంకర్, మాదాబత్తుల గురునాథ్, నాగోతు వెంకటరెడ్డి, ఉళ్ల దుర్గారావు తదితరులు నిరశన తెలిపారు.

ఐఐఎం, సమీర్ సంస్థల పరిశీలన

ఆనందపురం : మండలంలోని గంభీరంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఐఐఎం, సమీర్ సంస్థలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని, భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు తదితరులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సమీర్‌లో జరుగుతున్న పరిశోధనలను డైరెక్టర్ సుబ్బారావుని అడిగి తెలుసుకున్నారు. ఐఐఎంలో అడ్మిన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యంను కలిసి నిర్మాణ పనులపై ఆరా తీశారు. బీజేపీ భీమిలి మండల అధ్యక్షురాలు కంటుభుక్త సునీత తదితరులు ఉన్నారు.

ప్లాట్లు ఇప్పించాలని వినతి

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన తమకు పరిహారంగా ప్లాట్లు ఇప్పించాలని కోరుతూ నేరెళ్లవలస గ్రామానికి చెందిన నక్కాన సన్యాసమ్మ, రమణ, తునివలస గ్రామానికి చెందిన కొటాన అప్పయ్యమ్మ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో వినతిపత్రం ఇచ్చారు. ల్యాండ్ పూలింగ్‌లో నేరెళ్లవలస సర్వే నంబర్ 102లో తమకు చెందిన 1.20 ఎకరాలు తీసుకున్నారని నక్కాన సన్యాసమ్మ, రమణమ్మ, తునివలసలో సర్వే నంబర్ 54లో తన భూమి మూడున్నర ఎకరాలు తీసుకున్నారని కొటాన అప్పయ్యమ్మ ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ భూములకు ఓ నాయకుడు నామ మాత్రపు అడ్వాన్సులు చెల్లించి తమతో అగ్రిమెంట్లు రాయించుకున్నారని తెలిపారు. తాము ప్రభుత్వానికి ల్యాండ్ పూలింగ్ కోసం ఇచ్చిన భూములకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. తమ భూమి తీసుకుని అగ్రిమెంట్ ప్రకారం ఇస్తామన్న డబ్బులు ఇవ్వక పోగా, ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను వారి కబంద హస్తాల్లో పెట్టుకున్నారని ఆరోపించారు.

తమ భూమిని ఒక రాజకీయ నాయకుడు బినామీ పేర్లతో రాయించుకుని, తమకు డబ్బులు ఇస్తామని ఎర చూపుతున్నారని నరసాపురానికి చెందిన వాడపల్లి ఆదినారాయణ, అప్పారావు, సత్యారావు, నరిసింగరావు, గంగాధరరావు, చంద్రరావు, రెడ్డిపల్లి అమ్మాజీ విశాఖపట్నం కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం ఇచ్చారు. తమ భూమికి బదులుగా రావాల్సిన పట్టాలు ఇప్పించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

'భీమిలిలో రెడ్లకు బీసీ సర్టిఫికెట్లు ఇప్పించండి'

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో పేదరికంలో ఉన్న రెడ్డి సామాజికవర్గ ప్రజలకు బీసీ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరుతూ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, వైఎస్సార్‌సీపీ రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి సోమవారం కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రంల అందించారు. ఈ మేరకు వారు ప్రభుత్వం జారీ చేసిన రెడ్డిక బీసీ సర్టిఫికెట్ మెమో సర్కిల్ సూచీపట్టికను కలెక్టర్‌కు చూపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారికి ఈ వినతులు పంపించి పరిశీలించిన తర్వాత వివరాలు తెలియజేయాలని కోరామన్నారు. ఈ సందర్భంగా వీరిద్దరూ మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతోపాటు అనకాపల్లి జిల్లాలో కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు రెడ్డిక సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని తెలిపారు.

స్మార్ట్ మీటర్లతో రైతులపై భారం

ఆనందపురం : విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ప్రవేశ పెట్టిన కొత్త విధానాలను విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తోందని, దీనివల్ల రైతులపై భారం పడుతుందన్నారు. భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, కె.నాగరాణి, నరిసింగరావు పాల్గొన్నారు.

మధురవాడ: దొడ్డిదారిన ప్రజలపై విద్యుత్ భారం పెంచేశారని సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు అన్నారు. మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆ పార్టీ నాయకులు సోమవారం నిరశన తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరారు. పి.రాజ్‌కుమార్, కొండమ్మ, కిరణ్, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో మిగిలిపోయిన కార్మికుల సమస్యలను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మిల్లు ప్రతినిధి లలిత్‌మోహన్‌ను సోమవారం ఆదేశించారు. ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయన నివాసంలో ఈ మేరకు కలిసి సమస్యలు వివరించారు. ఎమ్మెల్యేను దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు, సాడి అచ్చారావు, గొలగాని రాము, కొల్లి రెడ్డి, ఎం.దేవుళ్లు, చిల్ల అప్పలసూరి, నరవ రామారావు కలిశారు.

పార్కు పరిరక్షణకు డిమాండ్

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్ మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు. 281/8, 9, 10లలో ఉన్న ప్రభుత్వ పార్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఏళ్ల తరబడి తిరుగున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బింద్రానగర్‌కి చెందిన చోడవరపు కరుణా సాగర్, కోట ఆనంద ప్రసాద్, రాజేష్ తదితరులు వాపోయారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్ చర్యలు చేపడతామంటున్నప్పటికీ కింది స్థాయి సిబ్బంది మాత్రం అలసత్వం వహిస్తున్నారని వాపోయారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఈ మేరకు జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. మొత్తంగా 9 అర్జీలు వచ్చాయని, తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

వేడినీరు పోయడంతో మహిళకు తీవ్ర గాయాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ వలందపేటలో ఈ నెల 17న పొరిగిళ్లల్లో జరిగిన తగాదా కారణంగా లక్ష్మి అనే మహిళ కోనాడ ఎర్రమ్మపై వేడినీళ్లు పోసింది. దీంతో ఎర్రమ్మ శరీరం 30 శాతం కాలిపోయింది. ఎర్రమ్మ భర్త అప్పలరాజు భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వేడినీళ్లతో దాడిలో లక్ష్మితోపాటు ఆమె కుటుంబ సభ్యుడొకరు పాల్గొన్నట్టు అప్పలరాజు ఆరోపించారు. గ్రామ పెద్దలు రాజీ పడాలని సూచిస్తున్నా కేసు నమోదు చేయాలని బాధితులు కోరుతున్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ కేవీపీ స్ట్రయికర్స్


కేవీపీ స్ట్రయికర్స్‌కు ట్రోఫీ, నగదు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 3న మండలంలోని తాళ్లవలసలో ప్రారంభమైన మెగా క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం స్ట్రయికర్స్ నిలిచింది. ఈ జట్టుకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా రూ.22,222 నగదు బహుమతి, ట్రోఫీలను సోమవారం అందించారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన తాళ్లవలస జట్టుకు రూ.11,111 నగదు బహుమతి, ట్రోఫీలు, 3, 4 స్థానాల్లో నిలిచిన గొల్లల తాళ్లవలస, వలందపేట జట్లకు రూ.5555, రూ.3333 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను ఎమ్మెల్యే, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 72 జట్లతో రూ.2.50 లక్షలు వెచ్చించి రెండు వారాలపాటు మెగా టోర్నమెంట్ నిర్వహించిన వైఎస్సార్ సేవాదళ్ యూత్ అధ్యక్షుడు చిల్ల హరిని ప్రత్యేకంగా అభినందించారు. ట్రోఫీలను బోయి అప్పలరెడ్డి, క్రీడాకారులకు జెర్సీలను బోయి వెంకటరెడ్డి సమకూర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు దంతులూరి వేణురాజు, చిన్నయ్యపాత్రుడు, ఫకీర్‌రాజు, చిన్ని రాజు, ఎరుసు గోవిందరెడ్డి, కాకర ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్స్ కూల్చితే అడ్డుకుంటాం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు పూర్తిగా బకాయిలు చెల్లించకుండా క్వార్టర్స్ కూలిస్తే అడ్డుకుంటామని సిటు నాయకులు హెచ్చరించారు. సోమవారం కార్యాలయంలో నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు మాట్లాడారు. ఇప్పటికే మిల్లు యాజమాన్యంపై హైకోర్టులో కేసులు ఉన్నాయన్నారు. 260 కార్మిక కుటుంబాలు క్వార్టర్స్ సెటిల్‌మెంట్ దరఖాస్తులే చేసుకోలేదన్నారు. ప్రస్తుతం క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారందరి తరపున కోర్టులో కేసులు ఉన్నాయన్నారు. యాజమాన్యం బెదిరింపులకు కార్మికులు భయపడవద్దని కోరారు.

బురద నీరు సరఫరా

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డులో కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ వెనుక, వాణి విద్యానికేతన్ పరిసర ప్రాంతాల్లో బురద నీరు వస్తోందని మహిళలు ఆరోపిస్తున్నారు.

నిడిగట్టు సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం


లబ్ధిదారులకు డాక్యుమెంట్లు అందజేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు సచివాలయంలో సోమవారం భూమి రిజిస్ట్రేషన్ సేవలను తహసీల్దార్ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి నిడిగట్టు గ్రామపరిధిలో భూముల అమ్మకాలు, కొనుగోలు వ్యవహారాలు సచివాలయంలోనే కొనసాగుతాయన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఇక నుంచి సేవలను నిరంతరం అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ బాబు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం


చంద్రంపాలెం హైస్కూల్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అరుదైన గౌరవం లభించిందని వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నారు. 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వాంబేకాలనీ సునీల్ శర్మ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయన, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ నీలమ్మ, ఇతర సభ్యులు సోమవారం సత్కరించారు. ఇక్కడి పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన శీరాపు కావ్యకి బంగారు పతకం, రూ.3 వేలు నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన కూరపాటి పూజితకి సిల్వర్ మెడల్, రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వానపల్లి అనురాధకి బ్రాంజ్ మెడల్, వెయ్యి రూపాయల ప్రోత్సాహంతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతాదేవి పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్‌లో...

చంద్రంపాలెం (మధురవాడ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా 2022 – 23 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన వారిని సత్కరించారు. ఇక్కడ 10వ తరగతిలో కొయ్యాన.మనోజ్ఞ 572, కొమ్మోజు భావన 572, ఎమ్.జ్యోతి 567 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బి.మీనా, ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజాబాబు అందజేశారు.

80 మందికి దంత వైద్య పరీక్షలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో సంగివలస అనిల్ ఎన్ ఆర్ఐ దంత వైద్య కళాశాల సిబ్బంది సోమవారం 80 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, వైద్యులు రఘురాం, మానస, లిఖిత, నిహారిక, సచివాలయ వైద్యురాలు స్వాతి, ఏఎన్ఎం రమణకుమారి, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలు అమర్చాలి

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకుని పాలెం గ్రామాల్లో వీధి దీపాలు అమర్చాలని, పద్మనాభం, ఇసకలపాలెం గ్రామాల్లో మురుగు నీటి కాల్వల్లో పూడిక తీయించాలని, ఇసకలపాలెంలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని హంస మహేష్, కాళ్ల శ్రీనివాసరావు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. పద్మనాభం నుంచి ఇసకలపాలెం వెళ్లే దారిలో కల్వర్టు కోసం వేసిన పైపు విరిగిపోవడంతో మురుగు నీరు రోడ్డు మీద నుంచి ప్రవహిస్తోందని ఆ వినతిపత్రంలో తెలిపారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల సోమవారం తెలిపారు. ఇక్కడ బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో ఈ నెల 14 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్స్ ఎంపిక చేసుకోవాలని, ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. వివరాల కోసం 92466 39197, 99899 37370, 99486 32130లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో పి.లక్ష్మికి వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా రూ.10 వేలు వైఎస్సార్ సీపీ నాయకుడు మాదు బుజ్జి సోమవారం అందించారు. ఇటీవల లక్ష్మి భర్త పేరి సూరి అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు మంజూరవుతాయని ఆయన తెలిపారు.

గీతంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కొమ్మాది: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా యువతలో సేవా భావం పెరుగుతోందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ టి.లక్ష్మమ్మ అన్నారు. గీతంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అత్యవసర పరిస్థితిలో ఉన్న వారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలు నిలుస్తాయని, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు నాలుగు అర్జీలు


అర్జీ స్వీకరిస్తున్న భీమిలి జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు నాలుగు అర్జీలు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి, ఇంజినీరింగ్ విభాగానికి ఒక్కో అర్జీ వచ్చింది. ఈ సందర్భంగా జెడ్సీ రాము మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దేవాలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ పరిధిలో హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మించనున్న రెండు దేవాలయాలకు సోమవారం స్థల పరిశీలన చేశారు. శొంఠ్యాం ఎస్సీ బీసీ కాలనీలో రామాలయం, గొంతినవానిపాలెంలో దుర్గాలమ్మ గుడి నిర్మాణం కోసం శ్రీవాణి ట్రస్ట్ సూపరింటెండెంట్ ఎస్‌కేసీఎం శర్మ, పురాణ పండిట్ సీహెచ్ సత్యనారాయణ స్థలాలు పరిశీలించారు. ఒక్కొక్క దేవాలయానికి శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.10 లక్షలు చొప్పున నిధులు అందజేస్తారు. లెంక రాంబాబు, పల్ల రమణ, కోరాడ వెంకట రమణారావు, గొలజాన రవి, గొంతిన స్వామినాయుడు, చందవరపు వెంకట రమణ పాల్గొన్నారు.

వడగాల్పులకు వృద్ధురాలు మృతి

తగరపువలస: తీవ్రమైన వడగాల్పులు, ఉక్కపోత కారణంగా తగరపువలస రామవీధికి చెందిన శీరపు ఎర్రమ్మ (90) సోమవారం ఉదయం మృతి చెందారు. రెండు రోజులుగా వీస్తున్న వడగాల్పులకు తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె ఆదివారం ఉక్కపోతకు తాళలేకపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం వేకువజామున ఉక్కపోతకు భరించలేక మృతి చెందారు.